విశాలాంధ్ర



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా

రామాయపట్నం పోర్టుకు భూములిచ్చిన కుటుంబాలకు మెరుగైన పునరావాస వసతులు కల్పిస్తాం: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: రాష్ట్రానికి వన్నె తెచ్చే ప్రాజెక్టుల్లో రామాయపట్నం పోర్టు ముందువరుసలో ఉంటుందని, పోర్టు ఏర్పాటుకు భూములిచ్చిన కుటుంబాలకు అన్ని విధాల అండగా ఉండి మెరుగైన పునరావాస వసతులు కల్పిస్తామని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు పేర్కొన్నారు. శనివారం ఉదయం గుడ్లూరు మండలం రామాయపట్నం పోర్టు భూ నిర్వాసిత కుటుంబాలకు పునరావాస సహాయ కార్యక్రమాల్లో భాగంగా రామాయపట్నం సమీపంలో ఏర్పాటు చేసిన ఆర్అండ్ఆర్ కాలనీకి కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి, జేసీ కూర్మనాథ్, కందుకూరు సబ్ కలెక్టర్ శోభికతో కలిసి కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు ఏర్పాటుతో వ్యవసాయ, మైనింగ్ ఉత్పత్తుల ఎగుమతి, దిగుమతులకు అనుకూలంగా ఉండి, నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు విరివిగా లభిస్తాయన్నారు. ఒక వైపు కృష్ణపట్నం పోర్టు, మరోవైపు రామాయపట్నం పోర్టు ఏర్పాటుతో పారిశ్రామి కరణంగా జిల్లా సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందన్నారు. రామాయపట్నం పోర్ట్ ఏర్పాటుకు మొండివారి పాలెం, ఆవుల పాలెం, రావులపాలెం, కర్లపాలెం గ్రామాల ప్రజల సహకారం మరువ లేనిదని, ఈ ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ పరంగా అన్ని విధాల అండగా ఉంటామని కలెక్టర్ చెప్పారు. న్యాయపరంగా నష్టపరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందిస్తున్నా మన్నారు. ఈ కాలనీలో నిర్వాసితులు అందరూ ఇళ్లు నిర్మించుకొని త్వరగా గృహప్రవేశాలు చేయాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి మాట్లాడుతూ పోర్టు నిర్వాసిత

గ్రామాల ప్రజ లకు చెప్పిన మాటకు కట్టుబడి నూరు శాతం హామీలు నెరవేరుస్తున్నట్లు చెప్పారు. గతంలో లాగా శంకు స్థాపనతో సరిపెట్టకుండా ముందే అన్ని రకాల అనుమతులు, నిధులు సమకూర్చిన తరువాతే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పోర్టు ఏర్పాటుకు ఈ ఏడాది జూలైలో భూమి పూజ చేశారని, అప్పటి నుంచి నిర్విరామంగా పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఎవరెన్ని కుట్రలు చేసినా, ప్రలోభాలకు గురి చేసినా నీతి నిజాయితీ గల మత్స్యకారులు వాటిని తిరస్కరించారని, ప్రభుత్వంపై నమ్మకంతో పోర్టు ఏర్పాటుకు, ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి తమ భూములను అందించారన్నారు. తాము కూడా మత్స్య కారులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్ ప్రత్యేక చొరవతో భూమి పూజ జరిగిన నాలుగు నెలలకే ఆర్ అండ్ ఆర్ కాలనీకి శంకుస్థాపన చేయడం, ప్యాకేజీ, భూసేకరణ ప్రక్రియ వేగంగా చేపట్టినట్లు చెప్పారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి భిన్నంగా ఈ ప్రాంత ప్రజలు తమకు నచ్చినట్లు ఇంటి నిర్మాణాలు చేసుకునే సంపూర్ణ స్వేచ్ఛను ప్రభుత్వం కల్పించిందన్నారు. జేసీ కూర్మనాథ్ మాట్లాడుతూ అత్యంత వేగంగా రామాయపట్నం పోర్టు పునరావాస ప్రక్రియను చేపట్టామని, గతంలో ఎక్కడా కూడా ఇంత వేగంగా చేపట్టిన దాఖలాలు లేవన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మెరుగైన ప్యాకేజీని ఈ ప్రాంత ప్రజలకు అందించామని, సద్వినియోగం చేసుకొని ఇళ్లను నిర్మించుకోవాలని ఆయన సూచించారు. కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక మాట్లాడుతూ రామాయపట్నం పోర్టును 2023 డిసెంబర్ లోపు పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు చెప్పారు. 850 ఎకరాల భూసేకరణకు సంబంధించి ఇప్పటి వరకు 450 ఎకరాలు భూసేకరణ పూర్తయిం దన్నారు. ఈ పోర్టు ఏర్పాటుతో భవిష్యత్ తరాలకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆమె చెప్పారు. అనంతరం మొండివారి పాలెంకు చెందిన 111 కుటుంబాలకు సుమారు రూ. 22 కోట్ల 49 లక్షల విలువైన భూ నష్టపరిహార చెక్కులను, ఇంటి నివేశ పట్టాలను కలెక్టర్, కందుకూరు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. తొలుత ఆర్ అండ్ ఆర్ కాలనీలో రామాలయ నిర్మాణానికి కలెక్టర్, కందుకూరు ఎమ్మెల్యే, జాయింట్ కలెక్టర్, కందుకూరు సబ్ కలెక్టర్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో రామాయపట్నం పోర్టు మేనేజింగ్ డైరెక్టర్ ప్రతాప్ రెడ్డి, లైజనింగ్ ఆఫీసర్ ఐ వెంకటేశ్వర రెడ్డి, గుడ్లూరు తహశీల్దార్ లావణ్య, ఎంపీపీ పులి రమేష్, గ్రామ కాపు పోలయ్య, పోర్టు నిర్వాసిత గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఆటో ద్విచక్ర వాహనం ఢీ - ఇద్దరికి గాయాలు

విశాలాంధ్ర- వలేటివారిపాలెం: మండలంలోని వలేటివారిపాలెం చుండి మధ్యలో ఉన్న ఆంజనేయస్వామి గుడి మలుపు దగ్గర ఆటో ద్విచక్ర వాహనం ఢీకొని ఇరువురికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుదర్శన్ యాదవ్ కథనం మేరకు.. శనివారం ఉదయం 7.30 గంటల సమయంలో కావలికి చెందిన బేతిరెడ్డి ప్రసాదు మనుమడు అంజుషా ఇద్దరు ఏపీ39హెచ్ యు5501నెంబర్ గల ద్విచక్రవాహనం పై మాలకొండ వెళుతుండగా మాలకొండ వైపునుండి ఏపీ26టీసి 7991నెంబర్ గల ఆటో వలేటివారిపాలెం చుండి మధ్యలో ఉన్న ఆంజనేయ గుడి దగ్గర మలుపువద్ద ఆటో ద్విచక్ర వాహనం ఎదురుఎదురుగా గుద్దుకోవటంతో బేతిరెడ్డి వారి మనుమడు అంజుషా ద్విచక్ర వాహనం పై నుండి కింద పడటంతో వారిరువురికి తలకు గాయాలయ్యాయి. వెంటనే 108కి సమాచారం అందించడంతో 108వచ్చి వారిని కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుదర్శన్ యాదవ్ తెలిపారు.

పంచాయతి రూములకు వేలం పాటలు

విశాలాంధ్ర- కలిగిరి: మండల కేంద్రమైన కలిగిరి సచివాలయంలో కలిగిరి గ్రామ పంచాయతి సర్పంచ్ రాగి దివ్య, ఉప సర్పంచ్ పాలూరి కొండారెడ్డి ఆధ్వర్యంలో కావలి - ఉదయగిరి మెయిన్ రోడ్ నందు గల 13షాప్ లకు వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో 12షాప్ లు వేలంలో 1,21,200 రూపాయలకు పాటదారులు చేజిక్కించుకున్నారని పంచాయతి కార్యదర్శి చేంచు కృష్ణారెడ్డి తెలిపారు.గత సంవత్సరం కన్నా 11700 రూపాయలు అధికంగా ప్రతి నెలకి వస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాట దారులు, పంచాయతి సిబ్బంది పాల్గొన్నారు.

హోం శాఖ ఆధ్వర్యంలో ఫ్లాగ్ డే ఫండ్ విరాళాలు సేకరణ: ఎంఇఓ

విశాలాంధ్ర-రాపూరు: ఆర్మ్డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే ఫండ్ విరాళా ల సేకరణ సందర్భంగా రాపూరు మండలం లోని ఉపాధ్యా యులు, ఎంఆర్సి సిబ్బంది అ ధికారులు ఫ్లాగ్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన హూండిలలో విరాళాలు మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో అందించారు. ఈ కార్య క్రమంలో ఎంఇఎస్, డీఈఓ, కార్యాలయ సిబ్బంది పాల్గొ న్నారు.

జిల్లా వర్ఫ్ బోర్డ్ చైర్మన్ కు ఘన సన్మానం

విశాలాంధ్ర- ఉదయగిరి: జిల్లా వైసీపీ కార్యాలయంలో జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ మీరా మొహిద్దీన్ ను జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గడాల్చి ఎస్దానిని పూలమాలలు శాలువా లతో ఘనంగా శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డికి నియోజకవర్గ ప్రచార కార్యదర్శి శాంత కుమారికి జన్మంతం రుణపడి ఉంటానని అన్నారు. పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. గండిపాలెం రోడ్ లో ఉన్న ముస్లిం స్మశానాన్ని షాది మంజిల్ ను అభివృద్ధి చేయాలని నియోజక వర్గంలోని వక్ఫ్‌బోర్డు ఆస్తులను కాపాడాలని కోరారు చైర్మన్ మీరామోదిన్ కోరారు. స్పందించిన ఆయన ముస్లిం మైనార్టీ ప్రజలకు తప్పకుండా తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు. అనంతరం నగర డిప్యూటీ మేయర్ ఖలీల్ జిల్లా వైసీపీ మైనార్టీ అధ్యక్షులు సయ్యద్ హజా హుసేని పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ షేక్ మృతుజ హుస్సేన్, డిటిసి డైరెక్టర్ కిల్లి సలీం, వార్డ్ మెంబర్ ఉప్పుటూరి శీను వైసిపి నాయకులు ఎద్దాని సుభాని సికిందర్ దాదాభాయ్ సర్దార్, లాడెన్, పెంచలయ్య, సుందర్ బాబు, సురేష్, ఉప్పుటూరి, రమణ, వెంకటస్వామి పాల్గొన్నారు.

మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలి

విశాలాంధ్ర- మర్రిపాడు: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో మహిళలపై జరుగుతున్న లైంగిక అత్యాచార దాడులను అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరుతూ మండల ఐద్వా అధ్యక్షురాలు ప్రమీల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కొద్ది రోజుల క్రితం నెల్లూరు ఓవెల్ స్కూల్, నక్షత్ర స్కూల్ లలో బాలికలపై పాఠశాలలో పాఠాలు నేర్పించే కొంతమంది ఉపాధ్యాయులు లైంగిక అత్యాచారానికి పాల్పడిన సంగతి తెలిసిందే. బాలికలపై అత్యాచారం చేసే నేరస్తులను కఠినంగా శిక్షించాలన్నారు. బాలికలు బాల్యంలో మంచి నడవడికతో నడిచి తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - కావలి : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కావలి పట్టణ షాదీ మంజిల్‌లో రాష్ట్ర టీడీపీ దివ్యాంగుల సం ఘం ఉపాధ్యక్షులు మండవ వెంకట్రావు ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ఆటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు పాల్గొని మాట్లాడుతూ కావలి పట్టణ టీడీపీ ఇంచార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు దివ్యాంగుల కోసం చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర పార్టీ మైనారిటీ సెల్ కార్యదర్శి షేక్ మస్తాన్, నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షులు పఠాన్ అనిఫ్, నియోజకవర్గ దివ్యాంగుల విభాగం అధ్యక్షులు మాధవరావు, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు అక్కిలిగుంట సూర్యప్రకాష్, నన్నేసాహెబ్ వేణు పాల్గొన్నారు.

రక్తం ఆవశ్యకతను యువత తెలపాలి

విశాలాంధ్ర - కావలి : యువ రక్త దాతలు సమాజానికి అవ స రమని, తరచూ రక్త దానం చేస్తూ రక్తం ఆవశ్యకతను ప్రజలకు తెలియజేయాలని డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్, రెడ్ క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ దామిశెట్టి సుధీర్ నాయుడు తెలిపారు. కావలి పట్టణంలోని మద్దూరుపాడు డిబిఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం రక్తదాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో సుధీర్ నాయుడు పాల్గొని రక్తదానం పై అవగాహన కల్పించారు. రక్తమనేది మనిషి శరీరం నుండి తప్పితే ఎక్కడ నుండి తయారు చేయలేమని తెలిపారు. రక్తదానం మీద ఉన్న అపోహలను గురించి వివరిస్తూ, ప్రతి ఒక్కరూ రక్త దాతలు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.వి.రావు, రమేష్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ నిర్మాణ పనులు వేగవంతం చేయండి: కమిషనర్

విశాలాంధ్ర- నెల్లూరు (కార్పొరేషన్): నవరత్నాలు పథకంలో భాగంగా పేదలందరికీ శాశ్వత గృహ వసతి కల్పించే దిశగా రూపొందిస్తున్న జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులను వేగవంతం చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశించారు. హౌసింగ్ డే కార్యక్ర మంలో భాగంగా రూరల్ నియోజకవర్గం కొండ్లపుడిలోని జగనన్న కాలనీ లే అవుట్ ను అధికారులతో కలిసి కమిషనర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ లబ్ధిదారుల భాగస్వా మ్యంతో నిర్మిస్తు న్న గృహాలలో నాణ్యతా ప్రమాణాలు పాటిం చేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులు లే అవుట్ల నిర్మాణ పనుల్లో పూర్తి స్థాయిలో విధులు నిర్వహిస్తూ, అభివృద్ధి పను లను ప్రత్యక్షం గా పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యుత్తు, వీధి దీపాలు, మంచినీరు, డ్రైన్లు, రోడ్డు మార్గాలు వంటి మౌలిక సదుపాయాలను కల్పించి లబ్ధిదారులకు గృహాలను కేటాయించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ విభాగం అధికారులు, సచివాలయం కార్యదర్శులు, నగర పాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులు సహకరిస్తే నెరవేరనున్న సొంతింటి కల: పీడీ

విశాలాంధ్ర- బిట్రగుంట: ఈనెల 21 నాటికి 100 ఇళ్లలో గృహ ప్రవేశాలు చేయిం చేందుకు చర్యలు చేపడు తున్నామని లబ్ధిదారులు సహకరిస్తే పేదవాడి సొంత ఇంటి కల త్వరగా నెరవేరు తుందని మండల ప్రత్యేక అధికారి జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకుడు డి వెంకట్రావు శనివారం బోగోలులో అన్నారు. జగనన్న లేఔట్లలో గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్షిం చేందుకు బోగోలకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు ప్రభుత్వం తరఫున అందించాల్సిన అన్ని సహ కారాలు అందించడం జరుగుతుందని లబ్ధిదారుల సహకారం కూడా ఉంటే పథకం ఉద్దేశం త్వరగా నెరవేరుతుందన్నారు. 50 శాతం ఇళ్లు మొదలుపెట్టిన లేఔట్లలో తాగునీరు విద్యుత్తు రోడ్లు వంటి మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట గృహ నిర్మాణ శాఖ ఏఈ వెంకటయ్య, ఉపాధి హామీ ఈసి రవి, సచివాలయం ఇంజనీరింగ్ సహాయకుడు అజయ్ ఉన్నారు.

బాలురపై లైంగిక దాడి

- వ్యక్తి అరెస్టు

విశాలాంధ్ర- బిట్రగుంట : బోగోలు మేజర్ పంచాయతీ కప్పరాళ్ల తిప్పకు చెందిన మేకల ప్రవీణ్ కుమార్ అలియాస్ చిన్న(20) అదే గ్రామానికి చెందిన ఇద్దరు బాలురపై లైంగిక దాడి చేసిన కేసులో ఎస్పీ విజయరావు ఆదేశాల మేరకు శనివారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు పంపి నట్లు కావలి డిఎస్పి వెంకటరమణ తెలిపారు. ఈ కేసు కు సంబంధించి బిట్రగుంట పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యస్ ఐ చినబలరామయ్యతో కలసి ఆయన మాట్లాడుతూ కప్పరాళ్ళ తిప్పకు చెందిన చిన్న అల్లరి చిల్లరగా తిరుగుతుంటాడని అతనిపై గతంలో కూడా బిట్రగుంట పోలీస్ స్టేషన్ లో కేసులు నమోదై వున్నాయన్నారు. నవంబర్ 29వ తేదీ ఆర్సీఎం పాఠశాల క్రీడామైదానంలో ఆడుకుంటున్న ఇద్దరు మగ పిల్లలకు మాయ మాటలు చెప్పి చాక్లెట్లు ఇచ్చి తన మోటారు బైకుపై ఎక్కించుకొని సమీపంలోనే జామాయిల్ తోటలోకి తీసుకుని వెళ్లి లైంగిక దాడి జరిపారన్నారు. బాలుర తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అతడిని రిమాండుకు పంపామన్నారు.

కొత్త ఓటరు జాబితా పై అఖిలపక్ష సమావేశం

విశాలాంధ్ర -బిట్రగుంట: రాబోవు ఎన్నికలకు సం బం ధించి కొత్తగా తయారు చేస్తున్న ఓటరు జాబితా లోని మార్పులు చేర్పులు తప్పులు సరిదిద్దడం పై మండలంలోని అన్ని రాజకీయ పార్టీ నాయకులతో బోగోలు మండల తహశీల్దార్ లక్ష్మీనారాయణ శనివారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీ నాయకులు కార్యాలయ సిబ్బందితో కలిసి ఆయన మాట్లాడుతూ గతంలోని ఓటర్ల జాబితాలో శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు మరణించిన వారి పేర్లు ఉన్నాయని వాటిని స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో తొలగించి ఖచ్చితమైన తప్పులు లేని ఓటరు జాబితాను తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఓటు హక్కు వచ్చిన యువతి యువకులకు కొత్తగా ఓటు నమోదు చేసే ప్రక్రియ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బోగోలులోని కొన్ని పోలింగ్ బూతులను శనివారం సాయంత్రం కావలి రెవెన్యూ డివిజనల్ అధికారి సీనానాయక్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ, సిపియం, బిజెపి జనసేన నాయకులతో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అలేఖ్యకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ సర్పంచ్

విశాలాంధ్ర - కావలి : పట్టణ రాజకీయాలను శాసించిన రాజకీయ దురంద రుడు, ఆర్యవైశ్య సీనియర్ నాయకులు, గ్రంధి యానాది శెట్టి కుమార్తె, కావలి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య జన్మదినం సందర్భంగా శనివారం మద్దూరుపాడు మాజీ సర్పంచ్ రావులకొల్లు బాలకృష్ణ ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పూల మొక్క ఇచ్చి ఆమెను సత్కరించారు.

సచివాలయాన్ని పరిశీలించిన సిఇఓ

విశాలాంధ్ర - నెల్లూరు: కొడవలూరు మండలంలోని నార్త్ రాజుపాలెం సచివాలయాన్ని శనివారం జట్పిసి ఇఓ చిరంజీవి ఆకస్మికంగా తనిఖీ చేసారు. పలు రికార్డులను పరిశీలించారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని బి ఎల్ ఓ ద్వారా వివరాలను అడిగితెలుసుకున్నారు. ఈయన వెంట యంపిడిఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

దివ్యాంగులలో ఆత్మవిశ్వాసం నింపాలి

విశాలాంధ్ర- మనుబోలు: దివ్యాంగు లలో ఆత్మవిశ్వాసాన్ని నింపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర నెట్ క్యాప్ డైరెక్టర్ దాసరి భాస్కర్ గౌడ్ అన్నారు. ప్రపంచదివ్యాంగుల దినోత్స వం సంద ర్భంగా ప్రభుత్వ సహకారంతో నడిచే భవిత కేంద్రాలలో వేడుకలు జరుపు కోవడం ఎంతో ఆనందించదగ్గ విషయమని రాష్ట్ర నెట్ క్యాప్ డైరెక్టర్ దాసరి భాస్కర్ గౌడ్ తెలిపారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ సందర్భంగా మనుబోలులోని భవిత కేంద్రంలో విద్యార్థుల చేత కేక్ కట్ చేయించి మిఠాయిలు పంచి పెట్టారు. మనుబోలు చెందిన ఎస్‌విడి ఆర్ మార్ట్ యజమాని ఆడిపూడి ధనుంజయ రెడ్డి సహకారంతో భవిత కేంద్రానికి ప్లాస్టిక్ చాపలు, పలకలు, విద్యాసామగ్రి అందజేశారు. అర్చకులు శ్రీనివాసులు సహ కారంతో విద్యార్థులకు మిఠాయిలు బిస్కెట్లు పంచి పెట్టారు. రాజవోలు పాడు గ్రామంలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న విజయ్ కుమార్ సహ కారంతో విద్యార్థులకు మాంసాహార భోజనం ఏర్పాటు చేశారు. సందర్భంగా భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ భవిత కేంద్రానికి ఇంతమంది దాతలు సహకరించడం శుభ పరిణామని మరింత మంది దాతల ప్రోత్సా హంతో ఈ కేంద్రాన్ని మరింత అభివృద్ధి పరుస్తామని హామీ ఇచ్చారు. నిరంతరం దివ్యాంగ విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుతూ వారికి విద్యా బోధన, మనో ఉల్లాసాన్ని అందించే మనుబోలు భవిత కేంద్రంలో పనిచేసే ఉపాధ్యాయులు శ్యామల, షర్మిల, దివ్యాంగ ఉపాధ్యాయుడైన శివ కుమార్ కు మనుబోలు జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎస్ శేషాద్రి వాసు, రెడ్డి సేవాసంఘం ఉపాధ్యక్షుడు ముంగర విజయభాస్కర్ రెడ్డి, ఆడిపూడి లోహిత్ కుమార్ రెడ్డి, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధాన ఉపాధ్యాయులు కాంతారావు, సైన్స్ ఉపాధ్యాయులు ఎస్.కె షావలి, విజయ్ కుమార్, శివ, భవిత కేంద్రం ఉపాధ్యాయులు శ్యామల, షర్మిలవిద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో చీకట్లో వైద్యం

విశాలాంధ్ర- రాపూరు: రాపూరు లో ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో గత రెండు రోజుల నుండి అత్యవసర విభాగంలో కరెంటు లేకపోవడంతో టార్చ్ లైట్ వెలుగులో, సెల్ ఫోన్ వెలుగులో చికిత్స చేయడం పై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం యాక్సిడెంట్ కేసు రావడంతో , టార్చ్ ,సెల్ ఫోన్ వెలు గులో చికిత్స చేశారు. ఈ దుస్థితి నుండి ప్రజలకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు పెద్దపీట: ఎమ్మెల్యే

విశాలాంధ్ర- బిట్రగుంట: ఎన్టీఆర్ ప్రభుత్వం తర్వాత వైసీపీ ప్రభుత్వంలోనే బీసీలకు పెద్దపీట వేశారని త్వరలో జరగబోవు బీసీ గర్జన కార్యక్రమానికి కావలి నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున బీసీలు తరలి వెళ్ళనున్నారని కావలి శాసనసభ్యుడు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి శనివారం బోగోలులో అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం 61వ రోజు కార్యక్రమంలో భాగంగా బోగోలు మేజర్ పంచాయతీ చెంచు లక్ష్మీపురంలో ఆయన పర్యటించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రాజధానుల నిర్ణయం అన్ని ప్రాంతాలు సమపాళ్లలో అభివృద్ధి చెందడానికి మాత్రమేనని దానిని ప్రతిపక్షాలు అనవసర రాజకీయం చేస్తున్నాయన్నారు. మూడు రాజధానుల నిర్ణయానికి తమ నియోజకవర్గము నుండి సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు పై కార్య క్రమంలో కావలి ఆర్డిఓ సేనా నాయక్ తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో గోవిందరావు, జెడ్పిటిసి కీర్తన, ఎంపీపీ సుజాత, సర్పంచ్ అనిత, యువత నాయకుడు మేకల శ్రీనివాసులు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టు శిక్షణా కేంద్రానికి టేబుల్ వితరణ



విశాలాంధ్ర - కావలి : పట్టణంలోని వెంగళరావు నగర్ లో సంయుక్త సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణా కేంద్రానికి విశ్రాంత ప్రధానోపాధ్యా యులు యమ్ అజిత్ బాబు శనివారం కటింగ్ టేబుల్ ను వితరణ చేశారు. ఈ సందర్భంగా దాత అజిత్ బాబు మాట్లాడుతూ కుట్టు శిక్షణా కేంద్రానికి కటింగ్ టేబుల్ అవసరమై ఉందని సంస్థ అధ్యక్షుడు సురేంద్ర తెలియజేసిన వెంటనే కటింగ్ టేబుల్ ని వితరణ చేయడం జరిగిందని తెలిపారు. మహిళలందరూ ఎంతో క్రమశిక్షణతో ప్రతి రోజూ వచ్చి కుట్టు శిక్షణ నేర్చుకోవాలని సూచించారు. ఈ శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత అందరికీ స్వయం జీవనోపాధిని కూడా కల్పిస్తామని తెలిపారు. సురేంద్ర అజిత్ బాబుకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ షేక్.మస్తాన్, కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భవ సర్వేను పూర్తి చేయండి

విశాలాంధ్ర- ఉదయగిరి: మండలంలో జరుగుతున్న ఆయుష్మాన్ భవ సర్వేను త్వరత గతిన పూర్తి చేయాలని స్థానిక ఎంపీడీవో పి ఐజాక్ ప్రవీణ్ వాలంటీర్లను ఆదేశించారు. శనివారం పట్టణంలోని బిట్1 సచివాలయం లో జరుగుతున్న ఆయుష్మాన్ భవ ఇంటిం టి సర్వే వివరాలను అడిగి తెలుసుకుని త్వరగా పూర్తి చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. విధులకు యూనిఫారంలో హాజరు కావాలన్నారు. తగు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్ర మంలో మండల కోఆర్డినేటర్ షేక్ గాజుల ఇమ్రాన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-ఆత్మకూరు : ఆత్మకూరు పట్టణంలో ఈ నెల 9వ తేది నుండి 12వ తేది వరకు నిర్వహించి జిల్లా సీఐటియు మహాసభలను జయప్రమదం చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నేత మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ సంధాని, అంగన్ వాడీ వర్కర్స్ యూనియన్ నాయకు రాలు రాధమ్మ, సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, ప్రజా నాట్యమండలి సంఘం షుకుర్ గద్దర్ బాబు, ఎల్ఐసి యూనియన్ నేత రమేష్, ఆశ వర్కర్స్ యూనియన్ రవణమ్మ మిగిలిన ఎంప్లాయిస్ యూనియన్ నేతలు హాజరయ్యారు.

సర్పంచి కొడుకు బెదిరిస్తున్నాడు

- ఆత్మహత్యే శరణ్యమంటున్న మాజీ సర్పంచ్

విశాలాంధ్ర - కావలి : కొండాపురం మండలం వెలిగండ్ల మాజీ సర్పంచ్ కొరివి కోటేశ్వర రావును ఆ గ్రామ సర్పంచ్ కుమారుడు, వైసీపీ నేత చంపు తామని బెదిరిస్తున్నట్లు ఆయన వాపోయాడు. కావలి జర్నలిస్ట్ క్లబ్ లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తన సొంత స్థలంలో రోడ్డు వేస్తుండటంతో తనకు స్థానికంగా న్యాయం జరగక హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. దీనిపై ఆ గ్రామ సర్పంచ్ కుమారుడు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. తన వద్ద ఉన్న ఆధా రాలు, గతంలో స్థలం మాదేనంటూ కోర్టు ఇచ్చిన తీర్పు, స్టే ఆర్డర్ అధికారుల ముందు పెట్టానన్నారు. కానీ సర్పంచ్ గా అధికారం చలాయిస్తున్న రమేష్ స్థానికంగా ఉండరన్నారు. గ్రామంలో ఏది సొంత స్థలం, బంజరు భూమి, కాళీగా ఉన్న భూమినో కూడా తేడా తెలియ దన్నారు. రోడ్డు వేస్తున్న స్థలం పూర్వీకుల నుంచి మా అధీనంలోనే ఉందన్నారు. కేవలం తాను టీడీపిలో ఉన్నానన్న కక్షతోనే మా స్థలంలో రోడ్డు వేస్తున్నట్లు తెలిపారు. తాను ఇంటిలో లేని సమ యంలో రమేష్ ప్రోద్భలంతో ఆయన మనుషులు మా భార్యను బెదిరి స్తున్నట్లు చెప్పారు. వారు మమ్మల్ని చంపే ముందే, మేమే ఆత్మహత్య చేసుకుంటామని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రమణారెడ్డి పర్యటన

విశాలాంధ్ర- సీతారాంపురం: తూర్పు రాయలసీమ ఉద్యమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి, 22 ఉద్యమ ఉపాధ్యాయ సంఘాలు బల పరిచిన అభ్యర్థి ఎల్సీ రమణారెడ్డి సీతారాంపురం మండలంలో పర్యటించారు. ఈ పర్యటనలో వారు జిల్లా పరిషత్ హైస్కూల్ , బసినేని పల్లి, బిజ్జంపల్లి అయ్యవారిపల్లి, సీతారాంపురం ఉన్నత పాఠశాలలు మరియు కేజీబీవీ సీతారాంపురం, మోడల్ స్కూల్ సీతారాంపురం సందర్శించి 2023లో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన అభ్యర్థిత్వాన్ని బలపరచమని, మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించమని విజ్ఞప్తి చేయడమైనది. సర్వీసు 25 సంవత్సరాలు పూర్తి చేసుకుని మిగిలిన 9 సంవత్సరాల సర్వీసును స్వచ్ఛందంగా వదులుకొని ఉపాధ్యాయుల సేవకై నీ ముందుకు వస్తున్నానని రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఆలోచించి ఓటు వేయాలని కోరారు. 12వ పిఆర్సి లో ఉపాధ్యాయులకు న్యాయం జరిగేటట్లు చూస్తానని, సిపిఎస్ రద్దు కోసం అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని, యాప్ల భారం ఉపాధ్యా యులకు తొలగి స్తానని తెలిపారు. వీరి వెంట మద్దతిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు, జిల్లా పరిషత్ హైస్కూల్ హెడ్మాస్టర్ పి సుధాకర్, రిటైర్డ్ మండల విద్యాశాఖ అధికారి ఆవుల వెంకటేశ్వర్లు యాదవ్, జయరామిరెడ్డి ,టీచర్ పుల్లారెడ్డి, గూడా రమణారెడ్డి పాల్గొన్నారు.

'ఇదేమి ఖర్మ' లో మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర- సీతారాంపురం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో రాష్ట్ర ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని ఉదయగిరి మాజీ శాసనసభ్యులు బొల్లినేని వెంకట రామారావు పేర్కొన్నారు. ఆయన శనివారం మండల పరిధిలోని రొంపి తోటల గ్రామంలో మండల టీడీపీ కన్వీనర్ కప్పు ప్రభాకర్ రాజు ఆధ్వర్యంలో రాష్ట్రానికి ఇదేమి ఖర్మ అనే కార్యక్రమం చేపట్టా రు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజలు ఎదు ర్కొంటున్న సమస్యలు, నిత్యవసరాలు ధరలు పెరుగుదల గురించి అడిగి తెలుసు కున్నారు. అనంతరం గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరి స్తుందని దీనితో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. దేశంలో ఎక్కడ జరగని లిక్కర్ స్కాం ఆంధ్రప్రదేశ్ లో జరుగుతుందని, తిరుమల తిరుపతి దేవస్థానం ఆంధ్రప్రదేశ్ లో లేకపోతే ఈ రాష్ట్రం వైపు కన్నెత్తి చూసే వారు లేరని ఆయన పేర్కొన్నారు. ఒక్కసారి అవకాశం ఇవ్వమని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను మరచి తన సొంత ఆస్తులను సంపాదించు కుంటున్నా రన్నారు. రాబోవు ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ని ముఖ్య మంత్రిగా చేసుకోపోతే రాష్ట్రం అల్ల కల్లోలంగా మారుతుందన్నారు. ప్రజలందరూ గమనించి చంద్రబాబు నాయుడు ని ముఖ్యమంత్రిగా చేసి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు కంభం విజయరామిరెడ్డి, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతరించిపోతున్న మొక్కల పెంపకం

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: వి ఎస్ యు జాతీయ సేవా పథకం ఆధ్వర్యం లో మరియు కడపలోని యోగి వేమన విశ్వ విద్యాలయం లోని లీడ్ బొటనికల్ గార్డెన్ వారు సంయుక్తంగా వివిధ రకాల ఔషధ మొక్కల సంరక్షణ కార్యక్రమాన్ని చేపట్టాయి. ఇందులో భాగం గా తొలి దశలో ఈ రోజు కొన్ని అరుదైన కలువ మొక్కలను వి ఎస్ యు లో సంరక్షించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి రిజిస్ట్రార్ డా. పి రామచంద్ర రెడ్డి గారు అతిధిగా హాజరయ్యి నాలుగు రకాల కలువ మొక్కలను ప్రత్యేకంగా ఏర్పరచిన చెరువులో నాటారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ అంతరించిపోయే మొక్కల జాతులను సంరంక్షించటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ సృష్టిలో భగవంతుడు మనకిచ్చిన జీవవైవిధ్యలో ప్రతి ప్రాణి విలువైనది ముఖ్యంగా మొక్కలు మనకు ఆహారం తో పాటు అనేక రకాలైన ఔషధ గుణాలు కలిగి ఉన్నాయి అని అన్నారు. మన ఆహారమే ఔషధం అని అందరూ మననం చేసుకోవలసిన తరుణమిది అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర ఆచార్యులు డా. ఎ మధుసూదన్ రెడ్డి గారు మాట్లాడుతూ యోగి వేమనలో లీడ్ బొటానికల్ గార్డెన్ అంతర్జాతీయంగా మంచి పేరున్న అతి పెద్ద బొటానికల్ గార్డెన్ గా రూపాంతరం చెందింది అని తెలిపారు. ఎన్నో వందల జాతుల మొక్కలు లీడ్ బొటానికల్ గార్డెన్ లో సంరక్షిస్తున్నామని అన్నారు. యోగి వేమన మరియు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం కలిసి అరుదైన మొక్కల సంరక్షణ చేపట్టటం ఒక మంచి పరిణామం అని తెలిపారు. భవిష్యత్తులో ఇరువురు ఉపకులపతులు ప్రోత్సాహం తో మరిన్ని పరిశోధనలు చేపడతామని అన్నారు. ఇందుకు ప్రోత్సాహం ఇచ్చిన వి ఎస్ యు ఉపకులపతి ఆచార్య జి యం సుందరవల్లి గారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య జి విజయ ఆనంద కుమార్ బాబు, ఎన్ ఎస్ ఎస్ సమన్వయ కర్త డా. ఉదయ్ శంకర్ అల్లం ప్రోగ్రాం అధికారులు డా. కె. సునీత, డా. కె . విద్యాప్రభాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా సాయి రుషి మోటార్స్ (డీటేలింగ్ మాఫియా) షోరూం ప్రారంభం

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: నెల్లూరు నగరంలోని పడారపల్లి ఫ్లైఓవర్ పక్కన సాయి రుషి మోటార్స్ (డీటేలింగ్ మాఫియా)ను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ ఎం. రవీంద్ర చౌదరి మాట్లాడుతూ ప్రతి కంపెనీకి సంబంధించి కార్లకు సంబంధిత ప్రతి వస్తువు తమ షోరూంలో లభిస్తుందని తెలిపారు. ఆధునిక టెక్నాలజీతో శిరామిక్ చేయబడును. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని వైజాగ్, విజయవాడ ,తిరుపతి, వంటి మహా నగరాలలో డీటేలింగ్ మాఫియా షోరూం లు ఉన్నట్లు తెలిపారు.అద వరవడి కొనసాగిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా విస్తరణ లో బాగంగా నెల్లూరు నగరంలో కూడా నూతనముగా డీటేలింగ్ మాఫియా షోరూం

ప్రారంభించడం జరిగిందని తెలిపారు. మీ కారుకు సంబంధించి ప్రతి వస్తువును అందించడమే కాక, మీకు ఏ విధంగా కావాలంటే ఆ విధంగా కారును తీర్చిదిద్దే సౌకర్యం ఆధునిక టెక్నాలజీస్ కలిగిన షోరూం అని ఆయన తెలిపారు. డిటేలింగ్ జనరల్ మేనేజర్ అజిత్ భరద్వాజ్ మాట్లాడుతూ మహా నగరాలలో ఉన్న సౌకర్యాలు నెల్లూరు నగరంలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఉన్నత ఉద్దేశంతో దీన్ని ప్రారంభించారని తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫణి మాధవి , ప్రవీణ్, భగవాన్, తేజ, చైతన్య, భాను ప్రసాద్, రాజేష్, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షోభంలో రొయ్యలు రైతులు

- కొన్ని ప్రాంతాల్లో క్రాప్ హాలిడే ప్రకటించిన వైనం

విశాలాంధ్ర-మనుబోలు:మనుబోలు మండల వ్యాప్తంగా వేల ఎకరాల్లో రొయ్యలను రైతులు సాగు చేస్తున్నారని ఎన్నడూ లేని విధంగా రైతులు సంక్షోభంలో ఉన్నారని జిల్లా బిజెపి నేత బోలా శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నాలుగు నెలల పాటు జరిగే క్రాప్ పంట చేతికి వచ్చే సమయంలో గిట్టుబాటు ధర లేక విల విల లాడుతున్నారని, గతంలో 100 అకౌంటు రొయ్యలు 300కు విక్ర యిస్తుండగా ప్రస్తుతం 150 రూపాయలకు పడిపోయింది. దీంతో రొయ్యలు రైతు దిగాలు చెందుతున్నారు. టన్ను లక్ష రూపాయలు పెట్టి పంట సాగు చేసి వాటిని అమ్మే సమయానికి ధరలు లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారన్నారు. మేత అప్పు ఇవ్వాలన్న దుకాణదారులు భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదేళ్ల క్రితం 50,000 ఉన్న మేత ప్రస్తుతం లక్షకు చేరిందని, కానీ రొయ్యలు మాత్రం గిట్టుబాటు ధర లేక రొయ్యలు సాగు చేయాలని అంటేనే రైతులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. మండలంలోని పల్లిపాలెం, కట్టువపల్లి ,కొలనకుదురు, కాగి తాలపూరు, తదితరచోట్ల రొయ్యలు సాగు చేస్తున్న రైతులు కొన్ని ప్రాంతాల్లో క్రాప్ హాలిడే ప్రకటించారని గతంలో రొయ్యల రైతు అంటే ఓ బిగ్ షాట్ గా భావించేవారని, ప్రస్తుతం రొయ్యలు రైతువంటే అప్పు ఇచ్చే వాళ్ళు కూడా భయాందోళనకు గురవుతున్నట్టు తెలుస్తోంది. ఇంకా కౌలు రైతులయితే ఆర్థిక నష్టం జరిగి

వీధిన పడే పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా తెచ్చిన అప్పులు కట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇదే కనుక కొనసాగుతూ వస్తే రొయ్యల రైతులు దివాలా తీయక తప్పదని పలువురు విశ్లేషకులు పేర్కొంటున్నారు. మేత, విద్యుత్ చార్జీలు కాపలాదారుల ఖర్చులు సాధారణ ఖర్చులు అన్ని భరించి రొయ్యల సాగు చేసి పంట కు గిట్టుబాటు ధరకు అమ్ముకోలేక రెండు చేతులతో తల పట్టుకొని రొయ్యల రైతు కన్నీరు మున్నీరు అవుతున్నారు. చైనా అమెరికా వంటి పెద్ద దేశాలకు ఉత్పత్తి జరగకనే ఈ సమస్య ఎదురవుతుందని పలువురు పేర్కొంటు న్నారు. రొయ్యల ధరలు విపరీతంగా పడిపోవడంతో కొందరు రైతులు ప్రత్యా మ్నాయ పంటలపై ముగుచూపుతున్నట్లు కూడా తెలుస్తోంది ప్రతిపక్షాలు రొయ్యల రైతులు తమ గోడును వెళ్లబోతున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం పలు విమర్శలకు దారితీస్తోంది. ప్రభుత్వం నష్టాల్లో కూరుకుపోతున్న రొయ్యల రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

రోడ్ మాస్టర్ డేటాలో సమగ్ర వివరాల నమోదు: కమిషనర్

విశాలాంధ్ర- నెల్లూరు (కార్పొరేషన్): నగర వ్యాప్తంగా మౌలిక వసతుల సమగ్ర సమాచారాన్ని రోడ్ మాస్టర్ డేటాలో పారదర్శకంగా పొందుపరచాలని కమిషనర్ హరిత సచివాలయం అమెనిటీస్ కార్యదర్శులను ఆదేశించారు. రోడ్ మాస్టర్ డేటాలో సమాచార నమోదుపై సచివా లయ అమెనిటీస్ కార్యదర్శులతో సమీక్షా సమావేశాన్ని కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. సమీక్షలో కమిషనర్ మాట్లాడుతూ సచివాలయాల వారీగా రోడ్లు, డ్రైను కాలువలు, భూగర్భ డ్రైను, విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల పూర్తి వివరాలను సమగ్ర సమాచారంతో మాస్టర్ డేటాలో నమోదు చేయాలని ఆదేశించారు. మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను అత్యంత వేగవంతంగా పరిష్కరించేందుకు డేటాలోని వివరాలు దోహదపడుతాయని కమిషనర్ తెలిపారు. సచివాలయం పరిధిలోని రోడ్లపై ఏర్పడే గుంతల మరమ్మతులు, డ్రైను కాలువల పూడికతీత పనుల ఫిర్యాదులను గుర్తించి పరిష్కరించేందుకు మాస్టర్ డేటా వివరాలు ఉపయోగపడతాయని కమిషనర్ వివరించారు. ప్రస్తుతం నమోదు చేస్తున్న వివరాలను మరింత నాణ్యతతో, పారదర్శకంగా నమోదు చేసేందుకు మాస్టర్ డేటా సాఫ్ట్ వేర్ ను చిన్నపాటి మార్పులతో అభివృద్ధి చేస్తున్నారని, అమెనిటీస్ కార్యదర్శులు సమగ్ర సమాచారాన్ని త్వరితగతిన పొందుపరచాలని కమిషనర్ సూచించారు. సచివాలయాల పరిధిలో మంచినీటి పన్నులు, డ్రైను కాలువల పన్నులపై నోటీసులు జారీచేసి, పన్నుల వసూళ్లను పెంచాలని కమిషనర్ ఆదేశించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులు సంపత్ కుమార్, సంజయ్, శేషగిరిరావు, చంద్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ పోరుకు సంఘీభావం : ఎస్‌టియు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీ మేరకు కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని సిపిఐ నిర్వహిస్తున్న పాదయాత్రకు ఎస్టియు నెల్లూరు జిల్లా శాఖ సంఘీభావం తెలుపుతోందని ఎస్ టి యు నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పన ఏడుకొండలు ఒక ప్రకటనలో తెలిపారు. కరువు ప్రాంతమైన కడప జిల్లా రాయలసీమకు కేంద్ర బిందువుగా ఉండి, వలసలతో అల్లాడుతున్నదనీ, వలస నివారణ కోసం కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని సిపిఐ పార్టీ ఈనెల 9వ తేదీ నుండి 13వ తేదీ వరకు కడప జిల్లాలో నిర్వహిస్తున్న పాదయాత్రకు సిపిఐ నెల్లూరు జిల్లా సమితి తో పాటు ఎస్ టి యు నెల్లూరు జిల్లా శాఖ కూడా సంఘీభావం ప్రకటిస్తున్నామని వారు తెలిపారు. ఉక్కు పరిశ్రమ వలన ప్రత్యక్షంగా 28 వేల మందికి, పరోక్షంగా మరో లక్ష మందికి జీవనోపాధి లభిస్తుందని దీనివల్ల వలసలు తగ్గే అవకాశం ఉందన్నారు. ఎన్నో ఏళ్లుగా కడప జిల్లా వాసులు ఉక్కు పరిశ్రమ కోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్నారన్నారు. ఉక్కు పరిశ్రమ కోసం కావలసిన వనరులన్నీ పుష్కలంగా ఉన్నప్పటికీ ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ కనపరచకపోవడం బాధాకరమన్నారు. ఉక్కు పరిశ్రమ కోసం చేపట్టే ఈ పాదయాత్రలో మేధావులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో సంఘీభావం ప్రకటించాలన్నారు. నేటి తరమే కాకుండా భావి తరాలకు కూడా ఈ ఉక్కు పరిశ్రమ వలన ఎంతో ప్రయోజనం ఉండే అవకాశం ఉందన్నారు.

టిడ్కో గృహాల రుణాలు మంజూరు చేయించండి

- రెవెన్యూ వసూళ్లు వేగవంతం చేయండి
- అధికారులకు కమిషనర్ ఆదేశం

విశాలాంధ్ర- నెల్లూరు (కార్పొరేషన్): నవరత్నాలు పథకంలో రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ గృహాలు అందించే కార్యక్రమంలో భాగంగా నిర్మించిన టిడ్కో గృహాలకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించి, లబ్ధిదారులకు త్వరితగతిన కేటాయించాలని అధికారులను కమిషనర్ హరిత ఆదేశించారు. టిడ్కో గృహాల కేటాయింపు ప్రగతిపై మెప్మా, హౌసింగ్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని కమిషనర్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులతో బ్యాంకు ఖాతాలు తెరిపించి, గృహ రుణాలను వేగవంతంగా మంజూరు చేయించాలని ఆదేశించారు. బ్యాంకులలో రుణాలు రిజెక్ట్ అయిన వారి వివరాలు సేకరించి తిరిగి రుణాలు మంజూరు చేసేందుకు కృషి చేయాలని కమిషనర్ సూచించారు. ఇతర ప్రాంతాల్లో తాత్కాలికంగా స్థిరపడిన గృహాల లబ్ధిదారులకు సమాచారం అందించి, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. టిడ్కో గృహ సముదాయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి త్వరితగతిన లబ్ధిదారులకు అందుబాటులోకి తేవాలని అధికారులను కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో మెప్మా పీడీ రవీంద్ర బాబు, హౌసింగ్ ఈ.ఈ ఉమా శంకర్ శాస్త్రి, అధికారులు రామసుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

అనంతరం రెవెన్యూ విభా గం తో సమీక్ష జరిపిన కమిషనర్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని, ఇప్పటికీ డిమాండ్ నోటీసులు జారీ చేయని కమర్షియల్ భవనాల ను గుర్తించి వసూళ్లను వేగ వంతం చేయాలని ఆదేశించారు. నగర పాలక సంస్థ బాడుగ షాపుల కేటాయింపులను ఆన్లైన్ లో అప్డేట్ చేసి వివరాలను పారదర్శకంగా ఉంచాలని కమిషనర్ ఆదేశించారు. నగర వ్యాప్తంగా ప్రతీ భవనాన్ని పన్ను పరిధిలోకి తీసుకొచ్చి, డిమాండ్ నోటీసులు జారీ చేయాలని కమిషనర్ ఆదేశించారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న పారిశుధ్య నిర్వహణ పనుల యూజర్ చార్జీల వసూళ్ళపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ సూచించారు. పన్ను వసూళ్ళలో సచివాలయ అడ్మిన్ కార్యదర్శులకు లక్ష్యాలను నిర్దేశించి కార్పొరేషన్ ఆదాయం పెంచేం దుకు అధికారులంతా కృషి చేయాలని కమిషనర్ సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, సెక్రెటరీ హేమావతి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులలో ఆత్మవిశ్వాసాన్ని నింపాలి

- లయన్స్ క్లబ్ చేయూత అభినందనీయం

విశాలాంధ్ర-బుచ్చిరెడ్డిపాలెం: దివ్యాంగులలో ఆత్మవిశ్వాసాన్ని నింపా ల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి డి.వి. నరసింహరావు అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా శనివారం బుచ్చిరెడ్డిపాలెంలోని భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రంగంలో దివ్యాంగులు విశేషంగా రాణిస్తున్నారని ప్రశంసించారు. వారిలో దాగి ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి వెలికి తీయాలన్నారు. ప్రభుత్వ వారికి ఉపకార వేతనాలు, వినికిడి యంత్రాలు, ప్రత్యేకంగా ఆరోగ్య సదుపాయాలు ఏర్పాటు చేసిందన్నారు. ప్రతి పాఠశాలలో వారికోసం ర్యాంపు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్క రించుకొని లయన్స్ క్లబ్ వారు వారికి భోజన క్యారియర్లను పంపిణీ చేశారు. వారికి చేయూత అందించిన లయన్స్ క్లబ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు మన్నేపల్లి శ్రీనివాసులు, మండల విద్యాశాఖ అధికారి ఎం దిలీప్ కుమార్, జిల్లా రిసోర్స్ గ్రూప్ సభ్యులు గండికోట సుధీర్ కుమార్, కౌన్సిలర్ రాచూరి సత్యనారాయణ, లయన్స్ క్లబ్ అధ్యక్షులు తెలనాకుల వెంకటేశ్వర్లు, సభ్యులు దర్శి బాల నరసింహరావు, సహిత విద్య ఉపాధ్యాయులు బి. శ్రీనివాసులు రెడ్డి, సి.హెచ్. శేషమ్మ, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నక్షత్ర పాఠశాల సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి

- విద్యార్థి సంఘాల డిమాండు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు నగరంలోని నక్షత్ర పాఠశాలలలో నిన్నటి రోజున జరిగిన సంఘటనపై వెంటనే సమగ్ర విచారణ జరిపించాలని విద్యార్థి సంఘాల నాయకులందరూ ఆ పాఠశాల ముందు శనివారం ధర్నా నిర్వహించారు. ఈధర్నాలో ఏఐఎస్ఎఫ్, ఏపీఎస్‌యు, టీఎన్ఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, నవ్యాంధ్ర విద్యార్థి జేఏసీ, ఆంధ్ర ప్రదేశ్ విద్యార్థి జేఏసి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మస్తాన్, వివియస్ చైతన్, ఆశిక్, ఆదిత్య, లీలామోహన్ మాట్లాడుతూ నెల్లూరు నగరంలోని మాగుంట లే ఔట్ నక్షత్ర స్కూలు వద్ద విద్యార్థి సంఘాల నేతలు ఆందోళన నిర్వహించారు. చిన్నారి తల్లి చేసిన ఆరోపణలకు సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వేధింపులకు సంబంధించి చిన్నారులలో తల్లిదండ్రుల పలు ఆందోళనలో ఉన్నాయని స్కూల్లో చదివే ప్రతి చిన్నారికి భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సుమోటోగా మానవ హక్కుల సంఘాలతో పాటు జిల్లా అధికారులు ఈ కేసును పరిగణనలోకి తీసుకొని నిజ నిజాలను వెలుగులోకి తీయాలన్నారు. సుమారు గంటసేపు స్కూలు ముందు విద్యార్థి సంఘ నేతలు బైటాయించి ఆందోళనచేశారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బాలికపై పాఠశాల కరస్పాండెంట్ జీవన్, డ్రైవర్ మహేష్ లపై వచ్చిన ఆరోపణలపై విద్యాశాఖ అధికారులు త్వరిత గతిన స్పందించి జరిగిన విషయాలపై సమగ్ర విచారణ జరిపి అక్కడ చదువుతున్న మిగతా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు భయభ్రాంతులకు గురి కాకుండా చూడాల్సిన బాధ్యత ఈ జిల్లా విద్యాశాఖ అధికారులపై ఉందని వారు తెలిపారు. చిన్నారి తల్లి చేసిన ఆరోపణలకు సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వేధింపులకు సంబంధించి చిన్నారులలో తల్లిదండ్రుల పలు ఆందోళనలో ఉన్నాయని స్కూల్లో చదివే ప్రతి చిన్నారికి భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సుమోటోగా మానవ హక్కుల సంఘాలతో పాటు జిల్లా అధికారులు ఈ కేసును పరిగణనలోకి తీసుకొని నిజ నిజాలను వెలుగులోకి తీయాలన్నారు. సుమారు గంటసేపు స్కూలు ముందు విద్యార్థి సంఘ నేతలు బైటాయించి ఆందోళనచేశారు.

జగన్ పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించా: జడ్‌పిటిసి

విశాలాంధ్ర- వలేటివారిపాలెం: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రప్రజలు సుభిక్షంగా ఉండాలని మాలకొండ మాల్యాద్రి లక్ష్మినరసింహ స్వామి ని ప్రార్థించానని జడ్పీటీసీ ఇంటూరి భారతి అన్నారు. శనివారం ఆమె లక్ష్మినరసింహస్వామిని దర్శిం చుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాలకొండ లక్ష్మీనర సింహస్వామి ఆశీస్సులు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, రాష్ట్రప్రజలపై ఉండాలని స్వామిని ప్రార్థిం చానని తెలిపారు. స్వామి దర్శనం అనంతరం ప్రతి శనివారం స్వామి సన్నిధిలో జరిగే అన్నదానంలో భక్తులకు ఆహార పదార్థాలను వడ్డించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లక్ష్మీనరసింహస్వామి పుణ్య క్షేత్రంలో భక్తులకు సేవలందించడం ఎంతో తృప్తి నిస్తుందని ఈ సందర్భంగా జడ్పిటీసీ ఇంటూరి భారతి అన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన ఇంటూరి

విశాలాంధ్ర- వలేటివారిపాలెం: మండలంలోని వీరన్నపాలెం గ్రామానికి చెందిన వల్లెం పెద మాల కొండయ్య, రత్తమ్మ కుమారుడు మనో హర్ రెడ్డి, ఇంద్రావతి వివాహం శనివారం మాల కొండపై జరిగింది. వీరన్నపాలెంలో జరిగిన రిసె ప్షన్ కార్యక్రమానికి నియోజకవర్గ టీడీపీ ఇం చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనర సింహం, గ్రామ పార్టీ అధ్యక్షుడు శనివారపు మాల్యాద్రి,పెద్దిరెడ్డి, బొమ్మసాని మాల్యాద్రి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

రైతులు వరి నారు పోసుకునే ముందు విత్తన శుద్ధి చేసుకోవాలి

విశాలాంధ్ర-రాపూరు: రైతులు వరి విత్తనాల కొనుగోలు చేసిన తరువాత మొదట నారు పోసుకునే ముందు విత్తన శుద్ధి చేసుకోవాలని రాపూరు మండల వ్యవసాయ అధికారి సోమ సుందరం తెలిపారు. రైతులకు తెలుపుతూ రబీ సీజన్ మొదలైందని 1కేజి వరి విత్తనాలకు 10 గ్రాముల సూడొ మెన్స్ పొడితో ఎకరానికి 25 కేజీల చొప్పున 250 గ్రా ముల సూడొమెన్స్ పొడితో విత్తనాలు శుద్ధి చేయాలని 25 రోజులు తరువాత పీకె వరి మొక్కలను సూడొమెన్స్ పొడితో 5 నుంచి 10 నిబీ వేర్లను ముంచి వుంచాలన్నారు. దాని వల్ల మొక్కలోకి వెళ్లే అన్ని తెగుళ్లను నివారించవచ్చన్నారు. నాట్లు వేసే ముందు వరి మొక్కల కొస భాగాలు తుంచితే కాండం తొలుచు పురుగు గుడ్లను పిగల కుండా నివారించవచ్చునన్నారు. వరి నాట్లు వేసే టప్పుడు తప్ప నిసరిగా ప్రతి 2 మీట ర్లకు 20 సెంటి మీటర్ల దూరం వుంచాలని, దీనివల్ల పిలకల సం ఖ్య ఎక్కువగా వున్నప్పుడు సుడి దోమను నివారించ వచ్చునని రైతులకు తెలిపారు. రైతులు సూడొమెన్స్ కావాలనే వారు వ్యవసాయ సిబ్బందిని సంప్ర దించాలని సోమసుందరం తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన తిక్కమనేని

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు మండలం లోని శానయ పాళేం అంగన్‌వాడీ కేంద్రాన్ని మండల బిజెపి కార్యదర్శి తిక్కమనేని వెంకటరత్నం, ఉపాధ్యక్షురాలు కోటీశ్వరమ్మ శనివారం సందర్శించారు. తిరుపతి పార్లమెంటు జిల్లా బిజెపి అధ్యక్షులు సన్నారెడ్డి దయకార్ రెడ్డి ఆదేశా లతో మండలం లోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి కేంద్రం ఇస్తున్న పౌష్టికాహారం అందుతుందా? లేదా? అని పరిశీ లించి అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక వసతులను పరిశీలించి లోటుపాట్లు వుంటే ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారికి తెలిపి ధర్నా నిర్వహిస్తామని, తిక్కమనేని, కోటీశ్వరమ్మ తెలిపారు. వీరితో పాటు బిజెపి కార్య కర్తలు పాల్గొన్నారు.

భారీ వాహనాల రాకపోకలు

- నిత్యం ప్రమాదాలు
- అధికారులు స్పందించాలి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు నగరంలో ముత్తుకూరు సెంటర్లో నిత్యం భారీ వాహనాలు పోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రతినిత్యం వాహనాలు ఇటు పోతున్నాయని ఇక్కడ స్కూళ్లు, హాస్పిటల్లో నిత్యం రద్దీగా ఉండే ప్రదేశంలో హెవీ వాహనాలు వెళ్లడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని ఇప్పటికైనా జిల్లా పోలీసు అధికారులు, అధికారులు చర్యలు తీసుకో వాలని సిపిఎం నాయకులు కాయం శ్రీనివాసులు కోరారు. ఈ సందర్భంగా రాస్తారోకు నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సమస్య వెంటనే పరిష్కరించకపోతే సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలకు పిలుపు నిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సుధాకర్, మల్లపు నారాయణ, సంపూర్ణమ్మ, కుమారు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు గురిచేసిన వ్యక్తిని అరెస్టు చేయాలి

- నక్షత్ర స్కూల్ గుర్తింపును రద్దు చేయాలి
- డీఈఓ కార్యాలయ ఏడీకి విద్యార్థి సంఘాల వినతి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నిన్నటి రోజున నెల్లూరు నగరంలో నిర్వహిస్తున్న నక్షత్రా స్కూల్లో 8వ తరగతి విద్యార్థిని ఆ స్కూల్ కరెస్పాండెంట్ జీవన కృష్ణ లైంగిక వేధింపులకు గురి చేసిన విషయం విద్యార్థిని తల్లిదండ్రుల తెలుసుకున్నారని అతడిని వెంటనే అరెస్టు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ఆ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని డీఈఓ కార్యాలయ ఏడీకి విద్యార్థి సంఘాల ఐక్యకారాచరణ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి ఆదిత్య సాయి మాట్లాడుతూ విద్యార్థుల విద్యార్థిని తల్లిదండ్రులను అడ్డుపెట్టుకొని వారి పాపకు చదువు చెప్పించాలని వారు పదేపదే కోరుతుండడంతో దాన్ని బలహీనతగా భావించిన కరస్పాండెంట్ జీవన కృష్ణ 8వ తరగతి విద్యార్థిని లైంగిక వేధింపులకు గురిచేసి ఆ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడే విధంగా హింసించారని ఇతనిపై పోక్స్ చట్టం నమోదు చేయాలని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండాలంటే స్కూలు గుర్తింపునను రద్దు చేయడంతో పాటు జీవన కృష్ణను కఠినంగా శిక్షించాలని అప్పుడే ఆ తల్లిదండ్రులకు ఆ విద్యార్థినికి న్యాయం జరుగుతుందని ఆ స్కూల్లో పనిచేస్తున్న డ్రైవర్ మహేష్ విద్యార్థినులు వాష్ రూమ్ కి వెళ్లే అక్కడికి వెళ్లి ఉండడం , ఈ ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థిని బాలుతో కొట్టడం కరెస్పాండెంట్ గార్డెన్ కి రమ్మంటున్నాడని పిలవడం ఇలా పలు రకాలుగా వేధించారని అందుకే ఆ విద్యార్థిని మానసిక వేదన తట్టుకోలేక చనిపోవాలని నిద్రమాత్రలు మింగిందని అప్పుడు తల్లిదండ్రులు గట్టిగా నిలదీస్తే అసలు విషయం బయటపడిందని తెలిపారు. ఈ విషయాన్ని ఎక్కడైనా చెబితే పై నుంచి తోచేసి కాలు జారి పడపోయిందని చెప్తామని భయభ్రాంతులకు గురిచేశారని అన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండాలంటే కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర విద్యార్థి జేఏసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.లీలామోహన్, కె.సంజయ్ ఎ.హరీష్ యాదవ్, బాలు, శ్రీను పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి ట్రస్టు అండ: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కోవూరు: ఆపదలో వున్న వారికి తమ తండ్రి నల్లపురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆదుకుంటామని ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా లేగుంట పాడు పంచాయతీలో పర్యటించినప్పుడు ఇచ్చిన హామీ ప్రకారం హరిజనవాడ లో తండ్రి క్యాన్సర్ వ్యాధితో చనిపోవడంతో చిన్నారులైన ఇద్దరు పిల లు బల్లి శశికుమార్ కు రూ.20 వేలు, బల్లి సుస్మితకు రూ.20 వేలు, 18 సంవత్సరాలు వచ్చేంతవరకు పడుగుపాడు సొసైటీ బ్యాంకులో రూ.40 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయనున్నట్లు కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డితెలిపారు. లేగుంటపాడు పంచాయతీకి చెందిన అల్లం భవానికి పెళ్లి ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు, అదే గ్రామానికి చెందిన గర్భిణీ ఇనమడుగు రమ్యకు రూ.10 వేలు, అదే గ్రామంలో టీబి వ్యాధితో బాధపడుతున్న షేక్ రెహమాన్ కు చికిత్స నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం, అదే గ్రామానికి చెందిన నిరుపేదరులైన షేక్ షర్మిల కు రూ.6,500 విలువచేసే కుట్టు మిషన్ అందించారు. మొత్తం రూ.86,500 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా బాధితులకు ఎమ్మెల్యే అందించారు.

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

విశాలాంధ్ర-రాపూరు: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రాపూరు మండల విద్యా వనరుల కేంద్రంలో ఉన్న ప్రత్యేక అవసరాలు గల విద్యా వనరు ల కేంద్రం భవితా కేంద్రంలో శనివారం మండ లంలోని దివ్యాంగ పిల్లలందరిని అహ్వానించి వారికి అటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి బి. శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎంఇఓ మాట్లాడుతూ దివ్యాంగుల కోసం ప్రభుత్వం నిర్వహించే అనేక కార్యక్రమాల గురించి తెలిపారు. మండ లంలో వున్న పిల్లలందరూ భవితా కేంద్రం సేవలను ఉపయో గించుకోవాలని పిల్లలో ఆత్మస్థైర్యం నింపాలని, ప్రతి ఒక్క విద్యార్థిని పాఠశాల కు పంపాలని తెలిపారు. నవంబర్ 19 వ తేది జిల్లాలో దివ్యాంగుల పిల్లలకు ఉచిత ఉపకరణాలు పంపిణీ కార్యక్రమం జరిగిందని, రాపూరు మండలంలో 11 మందికి ఉపక రణాలు అందించారన్నారు. 8 మందికి వినికిడి యంత్రాలు, ఇద్దరికి వీల్ చైర్లు, ఒక్కరికి సి.పి చైర్ అందించారని తెలిపారు. అనంతరం పిల్లలందరికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమం లో భవితా సిబ్బంది, ఎంఆర్‌సి సిబ్బంది, సిఆర్‌పి పాల్గొన్నారు.

13న చలో ఢిల్లీ మాదిగల మహా సింహగర్జన

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు నగరం లోని స్థానిక అంబేద్కర్ భవన్ లో సీమాంధ్ర ఎమ్మార్పీఎస్, ఏపీ ఎమ్మార్పీఎస్, మన ఎమ్మార్పీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్సీ వర్గీకరణ చేయనందుకు నిరసనగా ఈనెల 13వ తేదీ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మాదిగల సింహ గర్జన మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని మాదిగల అధిక సంఖ్య లో పాల్గొని ఈ సభను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పందిటిసుబ్బయ్య, మన ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పల్లాల శ్రీనివా సు లు, కుడుముల సుబ్బారావు, బద్దపూడి వెంకట్రావు, రఘు, చిన్నయ్య పాల్గొన్నారు.

ఓవెల్ 14 స్కూల్లో విద్యార్థినిపై లైంగిక దాడిలో నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

- కరస్పాండెంట్ పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో డిమాండు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు నగరంలోని కొండాయపాలెం గేటు వద్ద నున్న అంబేద్కర్ భవన్ లో దళిత విద్యార్థి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండుటేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశంలో మాల మహానాడు ఎమ్మార్పీఎస్ ఏపీ విద్యార్థి జేఏసీ, నవ్యాంధ్ర విద్యార్థి జెఏసి హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ సమాజ్వాది లోహియా వాహిని తదితర సంఘాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ అరుణ కృపాకర్ మాట్లాడుతూ నెల్లూరు నగరంలో నిర్వహిస్తున్న మొబైల్ పోర్ట్ ఇన్ స్కూల్లో దళిత విద్యార్థిని పై లైంగిక దాడి జరిగి 20 రోజులు కావస్తున్న ఆ ఘటనలో నిందితులుగా ఒట్టుగా ఉన్నా ప్రిన్సిపాల్ ప్రైమరీ ఇన్చార్జిలను ఎందుకు అరెస్టు చేయలేదన్నారు. పోలీసుల సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీనికి అంతటికి బాధ్యులైన కరెస్పాండెంట్ ఆర్ వేణు పేరుని ఎఫ్ఐఆర్ లో చేర్చాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఒక దళిత చిన్నారిపై జరిగిన జరిగిన అన్యాయంపై ప్రజా ప్రతినిధులు రాజకీయ పార్టీలు ఎందుకు స్పందించడం లేదో అర్థం కావడం లేదని ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాదనాల వెంకటరమణ పందిటి సుబ్బయ్య, కుడుముల సుబ్బారావు, పి ఆదిత్య సాయి, పి లీలా మోహన్, కే సంజయ్ , సుకుమార్, కందె కోటేశ్వరరావు, హరీష్ యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

విశాలాంధ్ర - మర్రిపాడు: మర్రిపాడు మండల విద్యాశాఖ కార్యాలయం లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహిం చారు. దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వ హించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్ర మంలో మండల అభివృద్ధి అధికారి నాగమణి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తున్నదని, దివ్యాంగులలో ఎన్నో అంతర్గత శక్తులు దాగి ఉంటాయని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వాటిని వెలికి తీసేందుకు కృషి చేయాలని, దివ్యాంగులు వైకల్యాన్ని లెక్క చేయకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని అన్నారు.ఈ సందర్భంగా దివ్యాంగులకు నాలుగు వీల్ చైర్లు,ఒక ట్రై సైకిల్ పంపిణీ చేశారు. దివ్యాంగులకు మర్రిపాడు మండలంలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న పద్మ,సరస్వతి వారి తండ్రి రిటైర్డ్ ఆర్మీ మేజర్ జ్యోతి యానాధయ్య జ్ఞాపకార్థం బహుమతులు, విందు భోజనం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మర్రిపాడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు శివజ్యోతి, ఎంఆర్సి రాజేంద్రకుమార్, జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి పోలయ్య, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయురాలు అనిత, సీఆర్పి కస్తూరయ్య, మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది కే.శ్రీనివాసులు, జీ.శ్రీనివాసులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై అధికారులు దాడులు

ఇద్దరు అరెస్ట్

విశాలాంధ్ర- మనుబోలు: మనుబోలు మండలం బద్దివో లు గ్రామంలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులపై శనివా రం దాడులు నిర్వ హిం చారు. సెబ్ సిఐ విజయ కుమార్ వివరాలు మీడియా కు వెల్లడించారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన వీ మస్తానయ్య వద్ద 15 బాటి ళ్లు ఏ శివశంకర్ వద్ద 25 బాటిళ్లు మొత్తం 41 బాటిళ్లను సీజ్ చేసి కేసు నమోదు చేసి గూడూరు మేజిస్ట్రేట్‌కు అప్పగించారు. దీంతో కోర్టు వీరికి 15 రోజులు రిమాండ్ విధించారు. ఈ దాడుల్లో శేషమ్మ ,హెడ్ కానిస్టేబుల్ కిరణ్ సింగ్, కానిస్టేబుళ్లు రమేష్, గౌస్ బాష, రాంప్రసాద్ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు కల్పించాలి

విశాలాంధ్ర-ఆత్మకూరు : మండలంలో 2023 అక్టోబర్ నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని ఆత్మకూరు తహశీల్దారు లక్ష్మినరసింహ తెలిపారు. శనివారం ఆత్మకూరు మండలంలో ఓటు నమోదు కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక డ్రైవ్ ను ఆయన పరిశీలించారు. మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఓలతో మాట్లాడుతూ ఓటు నమోదుతో పాటు ఓటుకు ఆధార్ అనుసంధానం త్వరితగతిన చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రం మార్పుకు అవసరమైన వారి వద్ద దరఖాస్తులు స్వీకరించాలని అన్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

బీసీ మహాసభను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-ఆత్మకూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 7న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వేదికగా జరిగే జయహో బీసీ మహాసభను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం ఆత్మకూరులోని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి కార్యాలయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జయహో బీసీ మహాసభ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాలే వెన్నెముక అనే నినాదంతో నిర్వహించే ఈ జయహో బీసీ మహాసభ కార్యక్రమానికి అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కొండా వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ మహబూబ్ బాష, నాయకులు నోటి వినయ్ కుమార్ రెడ్డి, ఉల్సా పెంచలయ్య, సురేష్ యాదవ్, సయ్యద్ జమీర్ బాష, చైతన్య, వాసు, నందవరం ప్రతాప్, వెంకటేశ్వర్లు, చిల్లారు వెంకటేశ్వర్లు ఉన్నారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో వికలాంగుల దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో - నెల్లూరు: అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరిం చుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, యం.యస్.ఆర్ స్పాస్టిక్ సెంటర్‌లో శనివారం ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా లోక్ అదాలత్ సీనియర్ సివిల్ జడ్జి, ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాస నాయక్ హాజరై పిల్లలను, పేరెంట్స్ ను ఉద్దేశించి ఈ వికలాంగులకు ప్రభుత్వం కల్పిస్తున్న హక్కులు , ప్రోత్సహకాలు, తల్లిదండ్రులు వారిపై చూపాల్సిన శ్రద్ధ , స్పాస్టిక్స్ సెంటర్లో ఇచ్చే ట్రైనింగ్ లు అందిపుచ్చు కొని తమ పిల్లలకు ఇంటి వద్ద ఆ సేవల ద్వారా నార్మల్ పిల్లలుగా తయారు చేసుకోవాలని సూచిం చారు. ఎంసి మెంబర్ దాసరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అన్ని అవయవాలు సక్రమంగా ఉన్న సాధారణ మనుషులు కంటే వికలాంగుల అయిన వీరు సంకల్పంలో సకలాంగులు అని ప్రపంచంలో తెలియజేసిన వారిలో కొందరు, స్టీఫెన్ హాకింగ్ గోల్ఫ్ ఆటలో నేర్పరి , హెలెన్ కిల్లర్ కి కంటిచూపు, వినికిడి లోపం ఉన్నప్పటికి ఆవిడ ఒక సంస్థనే నడిపారన్నారు. వీరందరూ తమ అంగవైకల్యాన్ని జయించి చరిత్ర లో స్థిరస్థాయిగా నిలిచారన్నారు. ప్రస్తుతం తమ మధ్య బ్లడ్ బ్యాంక్‌లో ఉపాధి పొందుతున్న శ్రీరామ్ ఈ రెడ్ క్రాస్ స్పాస్టిక్ సెంటర్ విద్యార్థి అన్నారు. ప్రిన్సిపల్ గురునాధ రావు మాట్లాడుతూ ఐఆర్‌సిఎస్ స్పాస్టిక్స్ సెంటర్‌లో అందిస్తున్న ఉచిత మధ్యాహ్న భోజన పథకం ,ఫ్రీ ట్రాన్స్‌పోర్టు, ఇతర సేవలు చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, కన్వీనర్ నేతాజీ సుబ్బారెడ్డి నేతృత్వం లో జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమానికి ఎఆర్‌వి కన్వీనర్ వెంకు రెడ్డి, తల సేమియా కోకన్వీనర్ పర్వీన్, స్పాస్టిక్ మెంబర్ అరుణమ్మ , సెక్రటరీ మస్తానయ్య , ఏవో చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ ఉమామహేశ్వరి, సిబ్బంది తల్లిదండ్రులు హాజ రయ్యారు. చిన్నారులకు ఆటలు పోటీలు నిర్వహించి ,డిస్టిక్ జడ్జి చేతుల మీదుగా బహుమా నాలు ఇచ్చారు. అనంతరం పండ్లు పంచారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

విశాలాంధ్ర- అనుమసముద్రంపేట: ఏ ఎస్ పేట మండలం అనుమసముద్రం గ్రామానికి చెందిన షేక్ ఇలియాజ్ అనే యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. బంధువులు స్నేహితుల కథనం మేరకు అనుమసముద్రం గ్రామానికి చెందిన నజీర్ కుమారుడు ఇలియాజ్ ఆటో డ్రైవర్ గా పని చేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా రెండు రోజుల క్రితం హైదరాబాదుకు బాడుగ ఉండడంతో కారు డ్రైవర్ గా వెళ్ళాడు. సికింద్రాబాద్ లోని రింగ్ రోడ్డు వద్ద మంచు కారణంగా రోడ్డుపై లారీ ఢీకొనింది. ఈ సంఘటనలో ఇలియాజ్ కు తీవ్రంగా గాయాలయ్యాయి. గాంధీ హాస్పిటల్ లో చేర్పించారు. చికిత్స పొందుతూ తెల్లవారుజామున ఇలియానా మృతి చెందాడని బంధువులు స్నేహితులు కన్నీటి పర్యంతం అయ్యారు. విషయం తెలుసుకున్న ఏఎస్పేట బస్టాండ్ లోని ఆటో యూనియన్ నాయకులు స్నేహితుడు రోడ్డు ప్రమాదంలో మరణించడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్ గా వెళ్ళిన కుమారుడు తిరిగి రాణి లోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రులు బంధువులు కన్నీరు మున్నీరు గా విలపించారు.

నెలలోపు అపోలో హాస్పిటల్ రహదారికి కొత్త రూపు

- భారీ వాహనాలు వెళ్లకుండా గడ్డర్ల ఏర్పాటు - వైసిపి రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గం పరిధిలోని అపోలో హాస్పిటల్ రహదారి మరమ్మతు పనులను మరో నెలలోపు పూర్తి చేసి కొత్త రూపు తీసుకువస్తున్నామని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు. రూరల్ పరిధిలోని 18 వ డివిజన్ లో నిర్మాణంలో ఉన్న అపోలో హాస్పిటల్ మరమ్మతు పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అపోలో హాస్పిటల్ రహదారి భారీ వాహనాల వల్ల గుంతలు పడి పలువురు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణిస్తూ పలువురు గాయపడుతున్నారని తమ దృష్టికి తీసుకు వచ్చారన్నారు. దీంతో ఈ రహదారికి కొత్త రూపం తీసుకొచ్చేందుకు 70 లక్షల రూపాయల నిధులు కేటాయించామన్నారు. రోడ్డు సామర్థ్యానికి మించి ఈ మార్గంలో భారీ వాహనాలు వెళ్లకుండా ఉండేందుకు మరమ్మతు పనులు పూర్తయిన వెంటనే గడ్డర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 18వ డివిజన్ కార్పొరేటర్ అశోక్ నాయుడు 17వ తేదీ కార్పొరేటర్ పెనేటి సుధాకర్ పాల్గొన్నారు.

నాడు నేడు పనుల పరిశీలన

విశాలాంధ్ర-ఆత్మకూరు : ఆత్మకూరు మండలం చెర్లోయడవల్లి సచివాలయం పరిధి లోని రావులకొల్లు పంచాయతీలో జరుగు తున్న నాడు నేడు పనులను శనివారం ఎంపీడీఓ సీ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళిక మేరకు సమన్వయంతో త్వరితగతిన పనులు జరిగేలా సిబ్బందిని ఆదేశించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయచంద్ర, ఇంజనీరింగ్ సహా యకులు పాల్గొన్నారు.

వైభవంగా పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఊంజల్ సేవ

విశాలాంధ్ర- రాపూరు: పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి ప్రీతి పదమైన శనివారం సందర్భంగా శ్రీవారి వైభవం స్వామి వారికి ఉదయం 4 అభిషేకం, 10.30.గంటలకి కళ్యాణోత్సవం, సాయంత్రం 5.30 గంటలకు చెంచులక్ష్మీ, ఆదిలక్ష్మి సమేత నరసింహ స్వామి వారి కి తిరుచ్చి పల్లకిలో ప్రధానార్చకులు, వేదపండితుల మంత్రోచ్చారణలతో మంగళ వాయిద్య, గిరిజనుల వాయిద్య నడుమ సహస్ర దీపాలంకరణ సేవ (ఊం జల్ సేవ)వైభవంగా నిర్వహించారు.

వైసిపి పాలనలో ఆక్వా రంగం కుదేలు

- గతంలో రూ.50 నుంచి 70 వేలకు వచ్చే ట్రాన్స్‌ఫార్మర్ ఇప్పుడు రూ.5 లక్షలు
- టీడీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి అబ్దుల్ అజీజ్

విశాలాంధ్ర - తోటపల్లి గూడూరు: నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గం, తోటపల్లి గూడూరు మండలం, మహాలక్ష్మి పురం గ్రామంలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇంఛార్జి అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన అక్వా రైతులకు 'ఇదేం ఖర్మ' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, కోవూరు నియోజకవర్గం ఇంచార్జ్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు దివి శివరాం, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలోని తీరప్రాంత ప్రజలందరూ ఆక్వా కల్చర్ పై ఆధారపడి ఉన్నారని, ఆక్వా రైతుల బాధలు తమకు తెలుసని, అందుకే సోమిరెడ్డి నాయకత్వంలో కార్యక్రమం ఏర్పాటు చేశామని అన్నారు. మనం కనీసం మన బాధలు బయటకు చెప్పుకుంటున్నామని వైసిపికి చెందిన రైతులు తమ బాధను బయటికి చెప్పుకోలేని దుస్థితిలో ఉన్నారన్నారు. అన్నం పెట్టే రైతు సంతోషంగా ఉంటే రాష్ట్రం మొత్తం సుభిక్షంగా ఉంటుందని, ఆంధ్ర రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి రైతుల నుంచి ఆక్వా రైతుల వరకు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఒక ఐరన్ లెగ్ జగన్మోహన్ రెడ్డి అయితే మరో ఐరన్ లెగ్ వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అని ఆయన మంత్రి కాగానే ఆక్వా రైతులకు కుదేలైపోయారన్నారు. ఆంధ్ర రాష్ట్ర మొత్తం 65 శాతం వ్యవసాయంపై ఆధారపడి ఉందని తీర ప్రాంతాల్లో 75 శాతం ఆక్వా కల్చర్ పై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. ఐటీ రంగం తర్వాత ఆక్వా రంగం ద్వారానే భారతదేశానికి భారీ ఎక్స్చేంజ్ ఎక్కువ శాతం వస్తుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2015 లో నెల్లూరు లో తూఫాను సహాయక చర్యల సమయంలో సోమిరెడ్డి, బీద రవిచంద్ర, బీద మస్తాన్ రావు, తాను కరెంట్ చార్జీలను తగ్గించామని అన్నారు. ప్రజలకు సహాయం చేయాల్సిన రాజు ధారాళంగా చేయాలని కండిషన్లు పెట్టి ఇవ్వటం సబబు కాదని అన్నారు. ఆక్వా కల్చర్ చేయమని ప్రభుత్వం ఏమి స్థలాలు ఇవ్వలేదని మన పూర్వీకుల స్థలాల్లో మనం కల్చర్ చేస్తున్నామని వాటికి రావాల్సిన రాయితీలు ప్రభుత్వం ద్వారా అందితే రైతు సుభిక్షంగా ఉంటాడని అన్నారు. ప్రభుత్వం స్పందించి ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అప్కాబ్ చైర్మన్ కొండూరు పాలిసెట్టి, రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, ముదిరాజు రాష్ట్ర కన్వీనర్ పి ఎల్ రావు, తిరుపతి రైతు పార్లమెంట్ అధ్యక్షుడు రాధాకృష్ణ నాయుడు, బీసీ సెల్ పార్లమెంట్ అధ్యక్షులు కప్పిర శ్రీనివాసులు, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చెముకుల కృష్ణ చైతన్య పాల్గొన్నారు.